ప్రజాశక్తి
గురువారం 16 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి



డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్యాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు నిఘా పెట్టారు. నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా కెమెరాలతో సోదా చేశారు. పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తన సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా కొనసాగించారు. బహిరంగంగా మద్యం సేవించడం, గ్యాంబ్లింగ్, అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు,గంజాయి వినియోగించిన వారిపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని ఎస్ఐ చెప్పారు. పుట్టపర్తిఅటవీ ప్రాంతాలైన జగరాజు పల్లి, కప్పల బండ ,వెంకట గారిపల్లి, కొట్లపల్లి, పై పల్లి, బత్తలపల్లి అడవి ప్రాంతాల్లోని నిర్మానుశ్యమైన ప్రాంతాలతో పాటుగా తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

లేపాక్షి : మండలంలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయడానికి సిఐ జనార్ధన్, ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక నిఘా చేపట్టారు. పేకాట, కోడి పందేలు ఆడితే వాటిని గుర్తించడానికి డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలమత్తూరు ఎస్ఐ మునీర్అహ్మద్, పోలీసులు పాల్గొన్నారు.

మరో వాహన పరిశ్రమ..!

- ఆజాద్ ఇండియా మొబిలిటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు
- రూ.1046 కోట్లతో పరిశ్రమ స్థాపన





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లాకు మరో వాహన తయారీ పరిశ్రమ రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఇది వరకే ఒప్పందం కుదిరింది. ఈ సంస్థ ఏర్పాటుకు అవసరమైన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలో ఇప్పటికే 'కియా' కార్ల తయారీ పరిశ్రమ ఉన్న విషయం తెలిసిందే. దాని సమీపంలోనే మరో వాహన తయారీ పరిశ్రమ రానుంది. ఎలక్ట్రికల్ త్రీ వీలర్, ట్రక్కులు, బస్సులు తయారీ పరిశ్రమ గుడిపల్లి వద్ద ఏర్పాటు కానుంది.

ఆజాద్ ఇండియా మొబిలిటీ సంస్థ ఏర్పాటు

సత్యసాయి జిల్లాలోని గుడిపల్లి సమీపంలో రూ.1046 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఆజాద్ ఇండియా మొబిలిటీ అనే సంస్థ ఇక్కడ ఎలక్ట్రికల్ ఆటోలు, ట్రక్కులు, బస్సులు తయారీ చేయనుంది. మూడు దశల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఏప్రిల్ 2026 నాటికి మొదటి దశ, ఏప్రిల్ 2028 నాటికి రెండవ దశ, 2030 నాటికి మూడవ దశ పూర్తవనుంది. రూ.1046 కోట్లతోచేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా 2231 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ చెబుతోంది.

గుడిపల్లి వద్ద 70.71 ఎకరాలు కేటాయింపు

గుడిపల్లి సమీపంలోనున్న ఎపిఐఐసి లేఅవుట్లో 70.71 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూముల కేటాయింపు కూడా దశల వారీగానే కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి దశకు 36 ఎకరాలు, రెండో దశకు 26 ఎకరాలు, మూడవ దశకు 8.71 ఎకరాలు ఇలా మూడు విడతల్లో భూ కేటాయింపులు జరపాలని ఎపిఐఐసికి ఆదేశాలిచ్చింది. దీంతో సత్యసాయి జిల్లాలో ఇప్పుడున్న కియాతోపాటు అదనంగా మరో వాహన పరిశ్రమ రానుంది. ఇదే కాకుండా మరో అతిపెద్ద పరిశ్రమ ఒకటి వచ్చే అవకాశముందని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అనంతపురం జిల్లాకు విచ్చేసిన సందర్భంలో ప్రకటించారు. ఆ పరిశ్రమ ఏదన్న దానిపై ఇంకా పూర్తి స్థాయి స్పష్టత లేదు. త్వరలో వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇవి కార్యరూపం దాలిస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కొంత వరకు మెరుగుపడే అవకాశాలున్నాయి.



సాంస్కృతిక కార్యక్రమంలో యువతులు

శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సంక్రాంతి పండగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని శిల్పారామంలో మూడు రోజులపాటు నిర్వహించిన సంబరాలు అలరించాయి. మంగళవారం భోగి సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ సహకారంతో శిల్పారామం ఏవో రమేష్ రెడ్డి సిబ్బంది మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా పులివెందుల రాజా డాన్స్ అకాడమీ వారి స్థానిక బిల్డర్లు ప్రదీప్, రమేష్ సహకారంతో డాన్సలతోపాటు జబర్దస్త్ ఫేమ్ రియాజ్, రాజమౌళి కామెడీ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారి చైత్ర పౌర్ణమి సినిమాలోని భరతనాట్యమున అనే పాటకు తల మీద దీపం, రెండు చేతులలో సంక్రాంతి దీపాలు పెట్టుకొని చేసిన నృత్యం ఆకట్టుకుంది. చిన్నారులు పెద్దలు చేసిన గ్రూప్ డాన్సులు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు స్థానిక టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్లు బెస్త చలపతి, పిసి గంగన్న, మైనార్టీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాజీ ఎంపీటీసీ శ్రీరామ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చెన్నకేశవులు తదితరులు బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ సందర్భంగా ధర్మవరం నాట్య అకాడమీ అధర్వంలో నిర్వహించిన నృత్యాలు అలరించాయి. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు కొనసాగాయి.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గురుమూర్తి

ప్రజాశక్తి-పెనుకొండ

కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గౌడ ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిని ఆసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆయన తమ సంఘం నాయకులతో కలసి బుధవారం నిర్వహించిన మంత్రి సవిత జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ ఈడిగ సంఘం నాయకులు మాజీ జెడ్పిటిసి చిన్నప్పయ్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్బి అతిథి గృహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంకి వెంకట గురుమూర్తితో గీత కార్మికులు మాట్లాడుతూ రెండు మూడు నెలలుగా పోలీసు ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు దుకాణాలపై దాడులు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గౌడ ఈడిగల అభివృద్ధికి కషి చేస్తానన్నారు. నియోజకవర్గాల వారిగా ఉన్న ఈడిగలతో జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ల ద్వారా అర్హులందరికీ రుణాల అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈడిగ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఈడిగ కులస్తులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈడిగ సాధికార స్టేట్ డైరెక్టర్ గోపాల్ గౌడ్ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్ కల్లుగీత కార్మిక సంఘం కార్యదర్శి పరకాల వెంకటేష్, ఐ టిడిపి పవన్, జనసేన నియోజకవర్గం నాయకులు కుమార్, హిందూపురం రామకృష్ణప్ప, సోమశేఖర్, దేవేంద్రప్ప, గిరి శేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా పార్వేటోత్సవం



మూలవిరాట్ ఊరేగింపులో ప్రముఖులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా మరుసటి రోజు ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి పార్వేటోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ ఉత్సవాన్ని చూడటానికి వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. సంక్రాంతి పండుగలో చివరి రోజు కనుమ రోజు సందర్భంగా బుధవారం ఉదయం ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి సతీ సమేత మూలవిరాట్లను కదిరి కొండకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కుమ్మరి వాండ్లపల్లి సమీపాన ఉన్న పాలపొంగు మండపానికి చేరుకొని అక్కడ స్వామివారి భక్తులు పాలు పొంగులను ఏర్పాటు చేశారు. పాల పొంగుల అనంతరం రైల్వే స్టేషన్ సమీపాన మార్కెట్ యార్డ్ ఎదురుగా వేలాదిమంది భక్తుల మధ్య ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి వారు పార్వేటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి, అప్గ్రేడ్ సిఐ నిరంజన్ రెడ్డి, రూరల్ సిఐ నాగేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆగ్రో ఫామ్ మేనేజర్ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రెస్క్లబ్ అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గా దేవి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి బాలాజీ ఆగ్రో ఫామ్ అధినేత చేయూతను అందించారు. ఈ మేరకు బాలాజీ ఆగ్రోఫాం అధినేత బాలాజీ తనవంతుగా రూ. 50వేలను ప్రకటించారు. దీంతో ఆగ్రో ఫామ్ మేనేజర్ గౌరీగానిపల్లి గంగాధర్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులను కలసి ఆ మొత్తాన్ని అందజేశారు. దీంతో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారాయప్ప, గోవర్ధన్, నటేష్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతుల ఊరేగింపులో పరిటాల శ్రీరామ్, తదితరులు

వైభవంగా జ్యోతుల ఉత్సవం

పాల్గొన్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరంలో నిర్వహించిన చౌడేశ్వరి అమ్మవారి శత జ్యోతుల ఉత్సవంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. మంగళ, బుధవారాల్లో పట్టణంలో జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు పరిటాల శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని 29వ వార్డులోని వజ్ర చౌడేశ్వరి అమ్మవారు, 24వ వార్డులోని స్వర్ణకళ చౌడేశ్వరి అమ్మవారు కట్ట, 21వ వార్డులోని దివ్య చౌడేశ్వరి దేవి అమ్మవారు కట్ట, 16వ వార్డులోని శ్రీ చౌడేశ్వరి దేవాలయం తదితర వార్డుల్లోని అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున ఆయన అమ్మవారిని దర్శించుకుని స్వయంగా జ్యోతులు ఎత్తారు. పట్టణంలో జరిగిన జ్యోతుల ప్రదర్శనలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. అమ్మవారి జ్యోతుల ఉత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

అసౌకర్యాల నడుమ అంగన్వాడీ కేంద్రాలు

చాలావాటికి సొంత భవనాలు కరువు
శిథిలావస్థలో భవనాలు
అద్దెలు చెల్లించలేక అవస్థలు


అంగన్వాడీ కేంద్రాలంటే చిన్నపిల్లలకు విద్య నేర్పించే అమ్మఒడి లాంటిది. ఇక్కడ పిల్లలకు మొదటగా చదువు కంటే ఆటపాటలతో వారిని కేంద్రాలకు రప్పించే విధంగా అంగన్వాడీ టీచర్లు వారిని మెప్పించి రప్పించే విధంగా విద్యా బోధన కొనసాగుతూ ఉంటుంది. ప్రభుత్వం వీరికి పౌష్టికాహారంతో పాటు కోడి గుడ్లు, గర్భిణులకు వైద్య పరీక్షలు, నమోదు, వారికి ప్రతి రోజు పౌష్టికాహారాన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తూ ఉంటారు. అయితే అమ్మ లాంటి అంగన్వాడీ కేంద్రాలకు పూర్తి స్థాయిలో సొంత భవనాలు కరువయ్యాయి. ఇక అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీకేంద్రాలకు ప్రభుత్వం సకాలంలో అద్దెలు చెల్లించడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం



ఫ్లోరింగ్, ప్లాస్టింగ్ లేక అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5126 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల పరిధిలో 30 మండలాల్లో 2301, శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల పరిధిలో 33 మండలాల్లో మెయిన్ సెంటర్లు 2198, మినీ సెంటర్లు 627 మొత్తం 2825 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇక హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మెయిన్ సెంటర్ 264, మినీసెంటర్లు 36 మొత్తం 330 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 98 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 184 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె లేకుండా 48 ఉన్నాయి. ఒక్క హిందూపురం ప్రాజెక్టు పరిధిలోనే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 శాతానికి పైగా అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పటికి ఆర్డిటి ప్రత్యేక చొరవ తీసుకుని మడకశిర, ధర్మవరం, కళ్యాణదుర్గం, శెట్టూరు, పెనుకొండ తదితర ప్రాంతాల్లో పలు భవనాలను నిర్మాణం చేసి అప్పగించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఆరు నెలలుగా అద్దెను చెల్లించ లేదు. ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలకు చాలా ప్రాంతాలలో సొంత భవనాలు పూర్తిగా లేవు. చాలా చోట్ల అద్దె భవనాల్లో చాలీ చాలని వసతులు నడుమ కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు కూడా బాడుగలు సక్రమంగా చెల్లించకుండా ఉండటంతో యజమానులు భవనాలు ఖాళీ చేయాలంటూ చెప్పడంతో వారు దిక్కుతోచని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా మొత్తం మీద అంగన్వాడీల పరిస్థితి దయనీయంగా ఉంది. అంగన్వాడీలకు రావలసిన వేతనాలు సక్రమంగా అందకపోవడం, వంట నిర్వహణ రావలసిన బిల్లులు కూడా అందకపోవడంతో అప్పులు చేసి ఎంతకాలం తాము మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలంటూ చాలామంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఖచ్చితంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. చిన్న భవనాలకు ఇలాంటి పరిస్థితులన్నీ ఉండడం చాలా అరుదు. చాలాచోట్ల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యాలయాల్లోనూ, వారు చూపించిన స్థలంలో వారి ఆధీనంలో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాలు ఇరుకు గదుల్లో ఉన్నాయి. మరి కొన్ని చోట్ల అయితే శిథిలావస్థలో ఉన్న భవనాలలో అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అక్కడ ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో అంగన్వాడీలు విద్యాబోధన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద కొన్ని గ్రామాలతో పాటు పట్టణాల్లో అంగన్వాడీ కేంద్రాలకు భవనాలను నిర్మించారు. అవి కూడా చాలా చోట్ల సకాలంలో బిల్లులు అందకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు గడిచిన కూడా ఇప్పటి వరకు అంగనవాడీ కేంద్రాల భవన నిర్మాణాల కోసం బడ్జెట్ కేటాయించక పోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీకేంద్రాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని గర్భిణులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్వాడీలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణం

ప్రభుత్వ భవనాల్లోనే ఉండాలి



జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ భవనాలలో ఉండాలి. అందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి దశల వారిగా పూర్తి చేసి అంగన్వాడీలపై అద్దె భారాలకు స్వస్తి చెప్పాలి. గత ప్రభుత్వంలో అంగన్వాడీ భవన నిర్మాణాలు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలి. పెండింగ్లో ఉన్న బిల్లులు కూడా వెంటనే చెల్లించాలి.

లావణ్య, అంగన్వాడీ కార్యకర్త ,
ఐసిడిఎస్ ప్రాజెక్టు హిందూపురం

సొంత భవనాలను ఏర్పాటు చేయాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా అంగన్వాడీ కార్యకర్తలకు కష్టాలు తప్పడం లేదు. కొన్ని కేంద్రాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి.

శ్రీదేవి జిల్లా కార్యదర్శి,
అంగనవాడీ యూనియన్ మడకశిర

సత్యసాయి సేవా మార్గం ఆదర్శనీయం



విద్యార్థులతో కలసి కేక్ కట్ చేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-హిందూపురం, పెనుకొండ

సత్యసాయి సేవా మార్గం ఆదర్శనీయమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, చేనేత జౌళి మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం తన జన్మదిన వేడుకలను హిందూపురం పట్టణంలోని సాయి సదన్ ఆనాధ[శ్రమంలో విద్యార్థుల నడుమ జరుపుకున్నారు. అదే విధంగా విద్యార్థులకు నూతన వస్త్రాలను అందించి, ఆశ్రమ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆశ్రమ అభివృద్ధి కోసం మంత్రి రూ.2,00,116 విలువైన చెక్కును ఆశ్రమ నిర్వహకులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు గత 12 సంవత్సరాల నుంచి హిందూపురం పట్టణంలోని సాయి సదన్ లో తన జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నట్లు చెప్పారు. సత్యసాయి బాబా చూపించిన సేవా మార్గం ఆదర్శనీయమన్నారు. అనంతరం పెనుకొండ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి శ్రేణులు భారీ కేక్ కట్ చేసి మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హిందూపురం నుంచి పెనుకొండకు వస్తున్న మంత్రికి ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం లభించింది. గొల్లపల్లి, కేతగాని చెరువు ,చాలుకూరు, గుడ్డం నాగేపల్లి, బ్రాహ్మణపల్లి ,చాకర్లపల్లి,.సోమందేపల్లి తదితర గ్రామాల్లో మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం పెనుకొండ 44వ జాతీయ రహదారి నుంచి భారీ ర్యాలీతో పట్టణంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పట్టణంలో దర్గా సర్కిల్ ఎన్టీఆర్ కూడలి వద్ద తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు కార్యకర్తలు మంత్రి సవితతో భారీ కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు , కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం : మంత్రి సవిత జన్మదిన సందర్భంగా పట్టణంలోని ఎస్వీఆర్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ శివప్రసాద్ నాయక్, మోహన్ బాబు, వెంకటరమణ ల్యాబ్ టెక్నీషియన్ నందకుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వాసవి కళ్యాణ మండపంలో కూటమి నాయకులు ఉచిత గుండె కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వడ్డెర సంఘం నాయకులు

పుట్టపర్తి రూరల్: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకు జిల్లా వడ్డెర సంఘం నాయకులు బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండలోని ఆమె నివాసంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు జెరిపిటి కృష్ణమూర్తి, వడ్డే సిమెంటు పోలన్న తదితరులు మంత్రికి పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మడకశిర : మంత్రి సవితకు స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ బోర్డ్ మెంబర్ ఎమ్మెస్ రాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గోరంట్ల : గోరంట్ల మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆశ్రమంలో పుట్టినరోజు జరుపుకున్న మంత్రి

మంత్రి సవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, బెల్లాల చెరువు చంద్ర, పచ్చ అశోక్, హరి వేణురాయల్, జయరాం తదితరులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ : తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మల్లాపల్లి వెంకట్ రెడ్డి మహమ్మద్ఆధ్వర్యంలో 150 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్ మల్లాపల్లి మహమ్మద్ బాలకృష్ణ చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

17న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గల పేద ప్రజల కోసం ఈనెల 17న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్పందన ఆసుపత్రి అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పందన హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఈ ఉచిత గుండె వైద్య శిబిరాన్ని కేవలం పేదల కొరకే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలోని సాయి నగర్ లో (బాబా గుడి వద్ద) స్పందన హాస్పిటల్ లో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెండేయ స్వామి ఆలయంలో పద్మశాలీయ బహుత్తమ క్యాలెండర్ను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేస్తామని ఆ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం అద్యక్ష, ఉపాధ్యక్షులు పుత్తారుద్రయ్య, జింకా నాగభూషణ, ప్రధానకార్యదర్శి మెటికల బాలకుళ్లాయప్ప, కమిటీసభ్యులు భాస్కర్, శ్రీనివాసులు, గంగాధర్, శివ, లక్ష్మీనారాయణ, పెద్దరెడ్డప్ప, గోవిందు, మోహన్, కరుణాకర్, కృష్ణమూర్తి, రంగస్వామి, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం డీఎస్పీ విజయ్కుమార్ స్థానిక కర్నాటక నాగేపల్లి సమీపంలో ఉన్న ప్రేమ సాయి సదనం వృద్ధాశ్రమంలో వృద్ధులను అన్నదానం చేశారు. వృద్ధుల మధ్య పండుగ జరుపుకోవటం ఆనందంగా ఉందని డీఎస్పీ విజయ్కుమార్ తెలిపారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని గరిశలపల్లి గ్రామంలో అధికారులు బుధవారం కంది పంటలో పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళా రైతులు విమలమ్మ, సుంకులమ్మకు చెందిన కందిపొలాల్లో పంట దిగుబడిని అంచానా వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎసీ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఎంపీఈఓ రవి, బీమా కంపెనీ కోఆర్డినేటర్లు మంజునాథ్, హుసేన్, రైతు సంఘం అధ్యక్షులు క్రిష్ణయ్య, వెంకటనారాయణ, పెద్దన్న, శ్రీనివాసులుతో పాటు రైతులు పాల్గొన్నారు.

సన్మానం

ప్రజాశక్తి - మడకశిర

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ శివప్రసాద్ను ఆపార్టీ నాయకులు సన్మానించారు. ఈ మేరకు శివప్రసాద్ బుధవారం వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త ఈరలక్కప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలని అందుకోసం తనవంతు సహకారం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి కుంచలిగ వక్కలిగ అనుబంధ కమిటీ అధ్యక్షులు రంగేగౌడు యాదవ్, కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ నాయకులు నాగేష్ గౌడు, మను, పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ప్రజాశక్తి క్యాలెండర్ను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. జిల్లా శ్రామిక మహిళా అధ్యక్షురాలు దిల్షాద్, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్హెచ్ బాషా, సిఐటియు, రైతుసంఘం నాయకులు ప్రజాశక్తి క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జెవి. రమణ, అయూబ్ ఖాన్, ఆదినారాయణ, రైతు సంఘం నాయకులు ఆలకుంట మారుతీ, ఎస్ఎఫ్ఐ నాయకులు నామాల నాగార్జున, చేనేత సంఘం నాయకులు హరి, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విజేతలకు బహుమతులు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా ధర్మవరం కళాశాల మైదానంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి మంత్రి సత్య కుమార్ యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల మైదానంలో నిర్వహించిన కేరళ వాయిద్యం ,చిల్ల కట్టే, బొంగరాలు, కోలాటం, కీలుగుర్రాలు, హమాలీల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కుల, మత వర్గాల భేదాలను దాటుతూ పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవడం మన సంస్కృతికి ప్రతీక అని అన్నారు. అనంతరం నిర్వహించిన హమాలీల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆయన పరిశీలించారు. ఈపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మంత్రి నియోజకవర్గ ఇన్ఛార్జి హరీష్ బాబు, ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కూటమి నాయకులు అంబటి సతీష్ కుమార్, శ్రీనివాసులు, సాకే ఓబులేష్, జింక చంద్రశేఖర్ తదితరులతో పాటు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ : పట్టణంలోనిజనసేన పార్టీ కార్యాలయంలో 13 వ వార్డు వృద్ధులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా దుప్పట్లను బుధవారం పంపిణీ చేశారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు డిష్ రాజు సహాయంతో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా సబ్జూనియర్ హాకీజట్టు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలలో పాల్గొనే సత్యసాయి జిల్లా హాకీ జట్టును ప్రకటించారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్,సత్యసాయి జిల్లా సెక్రెటరీ బంధనాథం సూర్య ప్రకాష్,హాకీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు బివి శ్రీనివాసులు జట్టును ప్రకటించారు. జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ ఇటీవల స్థానిక క్రీడా మైదానంలో జరిగిందన్నారు. జట్టు సభ్యులుగా శబరీష్ గౌడ్ ,ఫజులుద్దీన్, వెంకట్ అభిషిక్త్, రితీష్, రాంచరణ్, సాదిక్వలి, గోవర్ధన్, జశ్వంత్, నవదీప్, ఆదికేశవ, విక్కీ, పోతలయ్య, స్వామి, సచిన్, కార్తీక్, ధనుష్, రాహుల్, పునీత్, చరణ్ తేజ్ ఉన్నారన్నారు. ఈ జట్టుకు శబరీష్ గౌడ్ కెప్టెన్ గా వ్యవహరిస్తారని చెప్పారు. కోచ్గా సాయికుమార్, మేనేజర్గా వెంకటేష్ నాయక్ వ్యవహరించనున్నారని వివరించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి, జిల్లా జట్టును విజేతగా నిలపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాకీ సత్యసాయి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ అరవింద్ గౌడ్, జెన్నే చంద్రశేఖర్, కోచ్ హుస్సేన్ పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్టుకు హాకీ సత్యసాయి జిల్లా గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాల్,పల్లెం వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, మహమ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర,ట్రెజరర్ అంజన్న, డైరెక్టర్లు మారుతి, అమునుద్దీన్, కిరణ్, ఇర్షాద్ శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల రూపురేఖలు మారుస్తాం

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో రహదారుల నిర్మాణం చేపట్టి గ్రామాల రూపురేఖలను మారుస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని యర్రాయపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 9లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును కూటమి నేతలు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మొట్టమొదటిసారిగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శ్రీసత్యసాయి జిల్లాలోని యర్రాయపల్లి గ్రామంలోనే మొదటిసారిగా అడుగుపెట్టానని ఈ గ్రామంలోనే అభివృద్ధి పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధి కోసం రూ.1.500 కోట్లు విడుదల చేశామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు కసరత్తు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణంత, ఎంపీడీవో నరసింహనాయుడు, కోటి సూర్య ప్రకాష్ బాబు, చల్ల శ్రీనివాసులు, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, తాళ్లూరు సతీష్ నాయుడు, నెట్టెం రమణ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే

చెన్నేకొత్తపల్లి : రామగిరి మండలం వెంకటాపురంలో గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని సందడి చేశారు. సంక్రాంతి సందర్భంగా గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అందమైన రంగవల్లులు వేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే సునీత తన సొంత ఖర్చులతో బహుమతులు అందజేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్టీల్ ప్లేట్స్ ను బహుమతిగా పంపిణీ చేశారు. గ్రామంలో మహిళలు సరదాగా నృత్యాలు చేయగా. వారితో ఎమ్మెల్యే సునీత పాదం కలిపారు. ఈ ఉత్సవాలతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని ఇనుముల వారి పల్లి జడ్పీహెచ్ఎస్ హై స్కూల్లో 1990–1991వ సంవత్సరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు బుధారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలకు తమవంతు సాయం అందజేస్తామని చెప్పారు. అదే విధంగా పాఠశాల అభివృద్ధికి కూడా చేయూతను అందజేస్తామని తెలిపారు. అందుకోసం వారు ఒక ప్రణాళికను తయారు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చినగాని నరసింహ యాదవ్, కోటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమణా యాదవ్, సాయినాథ్ రెడ్డి, శ్రీరాం నాయక్, రమణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్టోర్నీ





నంబులపూలకుంట, మడకశిరలో జరిగిన ఫైనల్పోటీల విజేతలు

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల పరిధిలోని పెడబల్లి గ్రామంలో వైసీపీ నాయకుడు,మాజీ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రమేష్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు వైసీపీ నాయకుడు ఎం హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్టోర్నీ బుధవారం ముగిసింది. రమేష్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్లో ఎనిమిది జట్లు పాల్గొనగా పెడబల్లి సింహగర్జన టీం,ఎన్ పి కుంట క్రేజీ లెవెన్ జట్టు ఫైనల్ కు చేరాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో సింహగర్జన టీం విజయం సాధించింది. విజేత జట్టుకు ఆర్గనైజర్ హరీష్ రెడ్డి కప్ ను,25000 రూపాయల నగదును,రన్నర్స్ లకు కప్,15000 రూపాయల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పుల్లా రెడ్డి, మహేశ్వరరెడ్డి, శంకర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సమత ఎస్జీవో ఉమాశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర :మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీలో నిర్వహించిన గౌడనహళ్లి సంక్రాంతి ప్రీమియర్ లీగ్ పోటీలు బుధవారం ముగిసాయి. నవీన్, కిషోర్, సిద్దు, కన్నా ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఈ టోర్నీ నిర్వహించారు. బుధవారం జరిగిన ఫైనల్ పోటీలు ఎలైట్ ఈగల్, కాలనీ సూపర్ స్టార్స్ జట్ల మధ్య కొనసాగింది. ఈ టోర్నీ విన్నర్ గా ఎలైట్ ఈగల్స్ నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడనహళ్లి పంచాయితీ పరిధిలోని జమ్మానిపల్లి తురకవాండ్లపల్లి గౌడనహళ్లి గ్రామాల ప్రజలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక కొండకింద కాలనీకి చెందిన వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటనకు సంబందించిన పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు కాలనీకి చెందిన బోయ శివ (30) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవడు. ఈయనది సొంత ఊరు అనంతపురం అక్కడనుండి వలస వచ్చి మూడు నెలల కిందట ఈ కాలనీలో ఇల్లు తీసుకొని కుటుంబంతో సహ నివాసం ఉన్నాడు. బుధవారం శివ భార్య గార్మెంట్స్ కు వెళ్లడంతో. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శివ మద్యానికి బానిస అయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేకనే శివ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతునికి భార్య, ఒక కొడుకు కూతురు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ ఇందిర తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - రొద్దం

రొద్దం మండలంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని ఎం. కొత్తపల్లి గ్రామానికి చెందిన సంజీవప్ప(55) ద్విచక్ర వాహనంలో వెళుతూ పెనుగొండ ప్లేట్ల వద్ద కేబుల్ నెట్వర్క్ తీసిన కాలువలు, మట్టి కుప్పలో అదుపుతప్పి కిందికి పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన సంజీవప్పను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఆర్. మరువపల్లి గ్రామ సమీపంలో గ్రామానికి చెందిన వంశీ, చాంద్బాషా ద్విచక్రవాహనంలో వెళుతూ కేబుల్ నెట్వర్క్ తీసిన కాలువలు రోడ్డు సమీపంలో ఉన్న మట్టికుప్పపై అదుపుతప్పి కిందికి పడ్డారు. దీంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాదాపు ఆరు నెలలుగా ఈ రోడ్డుపై కేబుల్ నెట్వర్క్ పనులు చేస్తున్నారు. వారు తీసిన గుంతలు, మట్టి వల్ల పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు.

అనంతసాగరంలో ఘర్షణ

ప్రజాశక్తి - బత్తలపల్లి

పాతకక్షలను మనసులో పెట్టుకొని ఇరువర్గాల మధ్య మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఏడుగురు గాయపడ్డారని బత్తలపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన చెరుకూరి ఈశ్వరమ్మ, చెరుకూరి ఈశ్వరయ్య వర్గాల మధ్య గతంలో బంగారు గొలుసు విషయమై ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఈశ్వరయ్య మేనల్లుడు ప్రవీణ్పై కేసు నమోదు చేశారు. తమ మేనల్లుడుపైన కేసు నమోదు చేయిస్తారా అంటూ ఒకరిపై ఒకరు మంగళవారం ఘర్షణకు దిగారు. ఘర్షణలో దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఈశ్వరమ్మ, హేమంత్, రామాంజనేయులు, ఈశ్వరయ్య, ప్రవీణ్, గవ్వల, శివయ్య, గవ్వల ఈశ్వరమ్మ గాయపడ్డారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు చియ్యేడు గ్రామానికి చెందిన హేమంత్, నాగార్జున, రామాంజనేయులు, అనంతసాగరం గ్రామానికి చెందిన శివయ్య. ఆదెప్పలతో పాటు మరో ఆరుగురిపైనా ఈశ్వరమ్మ ఫిర్యాదు. మేరకు గవ్వల ప్రవీణ్, శివయ్య, ఈశ్వరయ్యలతో పాటు మరో ఐదుగురిపైన కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు

వైసిపి మండల కన్వీనర్కు సన్మానం

ప్రజాశక్తి - లేపాక్షి

వైసిపి మండల కన్వీనర్గా ఎన్నికైన సయ్యద్ నిసార్ అహ్మద్ను మండలంలోని మైనారిటీ సీనియర్ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా నిసార్అహ్మద్ మాట్లాడుతూ తనను ఎంపిక చేసిన వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్కు, హిందూపురం సమన్వయకర్త దీపిక వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. వారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు..ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు బషీర్, ఉస్మాన్, అయూబ్, ఫజులు, అస్లాం,తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించే సైనికుల సేవలు చిరస్మరణీయమని ఆదర్శ సేవా సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి గుద్దిటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం భారతీయ సైనిక దినోత్సవం సందర్భంగా పట్టణములోని ఆదర్శ సేవా సంఘం, ఆదర్శ పార్కు వద్ద భారతీయ సైనిక 77వ దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. తొలుత సైనిక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కుమార్ స్వామి, గౌరవ అధ్యక్షులు చెన్నా ప్రకాష్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలంలోని పోతుకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీ చెందిన భవన నిర్మాణరంగా కార్మికుడు అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన సాకే. కాశీ నాథ్ (55) బేల్దారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాశీనాథ్ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచి అంగజాల నాగవేణి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి రూ. 5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగజాల రాజశేఖర్, చంద్ర మహేష్, లక్ష్మి నారాయణ, నులక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఈ నెల 19న నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జయసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి బత్తలపల్లి

వైసిపి బలోపేతానికి సమిష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం తన స్వగృహంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి, పోట్లమర్రి, గంటాపురం, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన సర్పంచు అక్కిం దామోదర్, ఎంపీటీసీ కోటి నరేష్కుమార్, నాయకులు యోగానంద ఆచారీ, సంద్రా రామకృష్ణ, బిల్లే సూరీ, కొంకా గంగాద్రి. బొంతల నారాయణస్వామి, లోకేష్, సాకే సురేష్, సాకే వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రానికి చెందిన నోబుల్ టీచర్స్ అసో సియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. శివశంకర్,మండల ప్రధాన కార్యదర్శి జి.రామచంద్ర బుధవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు డైరీ, క్యాలెండర్ అందించారు.

సత్యసాయి సమాధిని దర్శించుకున్న ఐఎఎస్ డైరెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి సమాధిని దర్శించుకున్న ఐఏఎస్ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి దర్శించుకున్నారు. మంగళవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆయన బెంగుళూరు నుంచి కారులో ప్రశాంతి నిలయానికి వచ్చారు. ఎల్బిఎస్ నేషనల్ అకాడమీ డైరెక్టర్ ముస్సోరి నుంచి ఆయన ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ఆయనకు ప్రశాంతి నిలయంలో కలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా ఎస్పీ రత్న, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ట్రస్టు సభ్యులు స్వాగతం పలికారు. సత్యసాయి మహా సమాధి ని దర్శించుకున్న అనంతరం జిల్లా పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉన్నత అధికారులు అందరూ టీముగా ఏర్పడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన సూచించారు. రాత్రి 8 గంటలకు ఇక్కడి నుంచి బెంగళూరు బయలుదేరి వెళ్లారు.